క్లుప్తంగా

గిరిజన హక్కుల పరిరక్షణకు కృషి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శిల్పా

నంద్యాల(అర్బన్‌): గిరిజనుల హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తుందని శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి తెలిపారు. సంక్షేమ పథకాలను వినియోగించుకొని అభివృద్ధి సాధించాలని సూచించారు. సోమవారం స్థానిక ఎమ్మెల్యే నివాసంలో వచ్చే నెల 7న విజయవాడలో జరిగే గిరిజన శంఖారావం గోడపత్రికలను జీపీఎస్‌ రాష్ట్ర అధ్యక్షుడు రాజానాయక్‌ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. నాయకులు విక్రం నాయక్‌, రవినాయక్‌ పాల్గొన్నారు.

సుస్థిర వ్యవసాయంపై ప్రచారం

వాగలమర్రి: మండలంలోని ముత్యాలపాడులోనున్న బర్డ్స్‌ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సేంద్రియ, సుస్థిర వ్యవసాయంపై రైతులకు అవగాహన ప్రచార కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ముత్యాలపాడు, చక్రవర్తులపల్లె, తోడేండ్లపల్లె, బాచేపల్లె, ఆర్‌.క్రిష్టాపురం, డి.కొత్తపల్లె, డి.వనిపెంట తదితర గ్రామాల్లో ఆటోలో ప్రచారం చేపట్టారు. రైతులు పంటల సాగులో అధిక మోతాదులో రసాయనిక ఎరువులు, క్రిమిసంహారక మందులు ఉపయోగించడం వల్ల గాలి,నీరు,నేల, ఆహారం, వాతావరణం కలుషితం అవుతున్నాయని వివరించారు. వీటితో జంతువులతో పాటు మనుషులు కూడా వ్యాధులబారిన పడుతున్నారని, నివారణకు సేంద్రియ వ్యవసాయమొక్కటే మార్గమని రైతులకు అవగాహన కల్పించారు. సంస్థ కో–ఆర్డినేటర్‌ భాస్కర్‌, దివాకర్‌, వెంకటేశ్వర్లు, రాహుల్‌ పాల్గొన్నారు.

విద్యార్థుల నడవడికను మార్చాలి

రుద్రవరం: విద్యార్థుల్లో పెద్దల పట్ల గౌరవం పెంచేందుకు, వారి నడవడికను మార్చేందుకు తానా ఆధ్వర్యంలో అమ్మ,నాన్న,గురువు పద్యార్చన గావిస్తున్నట్లు ఏపీ మోడల్‌ పాఠశాల ప్రిన్సిపాల్‌ నాగేశ్వరరావు తెలిపారు. మండలంలోని తువ్వపల్లె తిప్పమీదున్న ఏపీ మోడల్‌ పాఠశాలలో సోమవారం తానా అధ్యక్షుడు నిరంజన్‌, మాజీ అధ్యక్షుడు జయశేఖర్‌ ఆధ్వర్యంలో శాంతి సద్భావన యాత్ర కార్యక్రమం నిర్వహించారు.ఇందులో భాగంగా చిగురుమళ్ల శ్రీనివాస్‌ రచించిన అమ్మశతకం, నాన్న శతకం ,గురువు శతకాల్లోని పద్యాలను తెలుగు ఉపాధ్యాయులు 550 మంది విద్యార్థులతో సామూహిక గానం చేయించారు. వైస్‌ ప్రిన్సిపాల్‌ సురేష్‌కుమార్‌,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తలనీలాల సేకరణకు వేలం

శిరివెళ్ల: శ్రీ సర్వ నరసింహస్వామి ఆలయ ఆవరణలో తలనీలాల సేకరణకు సోమవారం మూడవ సారి బహిరంగ వేలం పాటలు జరిగాయి.గతేడాది కంటే ఈ ఏడాది ఆదాయం తగ్గింది. నిరుడు రూ.5.01 లక్షలు రాగా ప్రస్తుతం రూ.4.38 లక్షలకు వేలం పలికింది. కార్యక్రమంలో ఎండోమెంట్‌ ఇన్‌స్పెక్టర్‌ హరిశ్చంద్రారెడ్డి, ఈఓ నరసయ్య, చైర్మన్‌ రేవనూరు రామాంజనేయరెడ్డి, ధర్మకర్తలు పాల్గొన్నారు.

సఫాయి కార్మికుల ఆరోగ్య పరిరక్షణకు చర్యలు

నంద్యాల(సిటీ): నంద్యాల మున్సిపల్‌ పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న సఫాయి కార్మికుల ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్‌ అసిస్టెంట్‌ కమిషనర్‌ వెంకటదాసు తెలిపారు. సోమవారం స్థానిక కార్యాలయంలో సచివాలయ శానిటరీ సెక్రటరీలకు, పారిశుద్ధ్య కార్మికులకు కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎన్‌ఎస్‌కేఎఫ్‌డీసీ (నేషనల్‌ సఫాయి కర్మచారీస్‌ ఫైనాన్స్‌, డెవలెప్‌మెంట్‌ కార్పొరేషన్‌) కో ఆర్డినేటర్లు సంతోష్‌, ఇబ్రహీం, హరీష్‌ అవగాహన వర్క్‌ షాప్‌ నిర్వహించారు. వారు మాట్లాడుతూ చేతులకు గ్లౌజులు, యూనిఫాం, కాళ్లకు షూ వేసుకోవాలని, ఆసుపత్రులు, పరిశ్రమల నుంచి వెలువడే వ్యర్థాలను సేకరించేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మున్సిపల్‌ హెల్త్‌ ఆఫీసర్‌ డాక్టర్‌ అంకిరెడ్డి, శానిటరీ సూపర్‌ వైజర్‌ లక్ష్మీనారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ శివప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

వేతనాలు పెంచాలి

నంద్యాల(న్యూటౌన్‌): ఉపాధి హామీ పథకంలో పనిచేస్తునన ఫీల్డ్‌ అసిస్టెంట్లకు వేతనాలు పెంచాలని వారు కోరారు. సోమవారం తమ సమస్యలు పరిష్కరించా లని జిల్లా కలెక్టర్‌ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. సీఐటీయూ ఆధ్వర్యంలో ఏపీ ఫీల్డ్‌ అసిస్టెంట్ల సంఘం నంద్యాల జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్‌, కార్యదర్శి అన్నపురెడ్డి దేవదాస్‌ మాట్లాడుతూ ఫీల్డ్‌ అసిస్టెంట్లపై రాజకీయ జోక్యం నివారించాలన్నారు. బాలన్న, సీఐటీయూ నాయకులు నాగరాజు, నాగన్న, సంపత్‌, విజయుడు, నాగలింగేశ్వరరెడ్డి, భగవాన్‌, ఈశ్వరరెడ్డి పాల్గొన్నారు.

కార్మికులకు దుస్తుల పంపిణీ

శిరివెళ్ల: స్థానిక మేజర్‌ గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు సోమవారం సర్పంచు సాలమ్మ దుస్తులు పంపిణీ చేశారు. 24 మంది కార్మికులకు ఒక్కొక్కరికి 2 జతల దుస్తులు,6 డబ్బాల కొబ్బెరి నూనె, చెప్పులు అందజేశారు. ఈఓఆర్డీ నాగేంద్ర, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బీ.అబ్దుల్‌ సలాం, ఉప సర్పంచు ఇంతియాజ్‌ పాల్గొన్నారు.

ఎంత మార్పు..



ఆరేళ్ల క్రితం - దొర్నిపాడు వద్ద వరి ధాన్యాన్ని తూర్పారబడుతున్న రైతన్న

గతంలో ఎకరా పొలంలో సాగైన వరి పంట నుంచి ధాన్యం ఇంటికి రావాలంటే వారం రోజులు పట్టేది. ముందుగా కూలీలతో పంటను కోసి వనలను ఆరబెట్టి పడుగు వేసేవారు. నాలుగు రోజుల తర్వాత ట్రాక్టర్లు లేదా గుండుతో తొక్కించి వరి కర్రల నుంచి ధాన్యాన్ని వేరు చేసి పిప్పిని తొలగించి తూర్పారబట్టేవారు. ఈ ప్రక్రియ ముగియడానికి కనీసం వారం నుంచి పది రోజులు పట్టేది. ప్రస్తుతం యంత్ర వినియోగం పెరగడంతో వ్యవసాయం సులభతరమైంది. కేవలం గంటలోనే కోత కోసి ధాన్యాన్ని సంచుల్లో నింపుతున్నాయి. యంత్రాల రాకతో రైతన్నలకు రెక్కల కష్టం దాదాపుగా తగ్గింది.

– దొర్నిపాడు



ప్రస్తుతం - క్రిష్టిపాడు వద్ద పంటను కోసి ధాన్యాన్ని వేరు చేస్తున్న నూర్పిడి యంత్రం

గడప గడపకు మంచి చేస్తున్నాం



బొమ్మలసత్రంలో మహిళలకు పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవి

నంద్యాల(సిటీ): కుల మత, రాజకీయాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలకు మంచి చేస్తున్నామని ప్రతి గడపకు సంక్షేమ పథకాలు అందజేస్తున్నామని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని బొమ్మలసత్రంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం వార్డు ఇన్‌చార్జ్‌ ఖాసీం, వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా జనరల్‌ సెక్రటరీ శ్రీనివాసరావుతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వెంటనే వాటిని పరిష్కరించాలని అక్కడేనున్న అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణంలోని ప్రతి గృహానికి సంక్షేమ ఫలాలు అందించామని, అన్ని వర్గాలను అభివృద్ధి పథంలో నడిపిస్తూ ప్రజల శ్రేయస్సు కోసం కృషి చేస్తున్న సీఎం వైఎస్‌ జగన్‌ మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంగా గెలిపించాలని కోరారు. దాదాపు 90శాతం పైగా హామీలను అమలు చేసినా తెలుగు డ్రామా పార్టీ నాయకులు ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నాలు చేస్తున్నారు. ఎన్నికల సమీపంలో మాత్రమే కనిపించే ఆపార్టీ నాయకుల మాటలను ప్రజలు విశ్వసించరని, ఇక వారికి రాజకీయ వనవాసమేనన్నారు. కార్యక్రమంలో మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ షేక్‌ మాబున్నీసా, రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు శశికళారెడ్డి, రాష్ట్ర దృశ్య కళల డైరెక్టర్‌ సునీత అమృతరాజ్‌, మున్సిపల్‌ వైస్‌ చైర్మన్‌ పాంషావలి, నంద్యాల పట్టణ మూడవ అధ్యక్షుడు జాకీర్‌హుసేన్‌, నాయకులు మాధవరెడ్డి, దస్తగిరి, అశోక్‌రెడ్డి, జమాల్‌ బాషా, అనంతలక్ష్మి, ఖాద్రి, షరీఫ్‌, నాగరాజు, రమణ, శివాజీరావు, రమణారెడ్డి, విజయకుమార్‌ పాల్గొన్నారు.

బెస్ట్‌ స్కూల్‌గా ‘గురురాజ’



పాఠశాల డైరెక్టర్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

నంద్యాల(న్యూటౌన్‌): స్టేట్‌ బెస్ట్‌ స్కూల్‌ ఎక్సలెన్స్‌ అవార్డు శ్రీగురురాజ విద్యా సంస్థలకు దక్కింది. ఆదివారం హైదరాబాద్‌లోని హైటెక్‌ ఎగ్జిబిషన్‌ సెంటర్‌లో ట్రైయిన్‌ఫీడ్‌ సంస్థ ఎంటర్‌టైన్‌మెంట్‌ టెక్స్‌ అవార్డును స్టేట్‌ టాప్‌ 5 పాఠశాలలకు గాను తమ పాఠశాలకు అత్యున్నత పురస్కారం అందజేసిందని పాఠశాల డైరెక్టర్‌ షేక్షావలిరెడ్డి తెలిపారు. సోమవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆయన మాట్లాడుతూ అకడమిక్‌ కరిక్యులమ్‌లో భాగంగా టెక్నికల్‌ లర్నింగ్‌ మోస్ట్‌ ఇన్నోవేటివ్‌ మెథడ్స్‌ ఆల్‌రౌండ్‌ డెవలెప్‌మెంట్‌ వంటి అంశాల్లో నూతన తత్వాన్ని ఉపయోగిస్తూ బోధన చేస్తున్నందుకు గాను అవార్డు లభించిందన్నారు. అవార్డు అందుకున్న డైరెక్టర్‌ను పాఠశాల ఉపాధ్యాయులు సత్కరించారు.

ఆ విధులు అప్పగించొద్దు

నంద్యాల(న్యూటౌన్‌): ఉపాధ్యాయులకు అంగన్‌వాడీల నిర్వహణ విధులు అప్పగించరాదని ఫ్యాప్టో నాయకులు కోరారు. సోమవారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఏడీ గోపాల్‌కు సోమవారం వినతి పత్రం అందజేశారు. ఫ్యాప్టో సెక్రెటరీ సుబ్బన్న, ఏపీటీఎఫ్‌ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రామచంద్రారెడ్డి, శివయ్య మాట్లాడుతూ అంగన్‌వాడీల సమ్మెకు మద్దతు ఇస్తున్నామని, అంగన్‌వాడీల్లో విధుల నిర్వహణకు ఉపాధ్యాయులు డిప్యూటేషన్‌పై వెళ్లాలని డీఈఓ మౌఖిక ఆదేశాలు జారీ చేయడం తగదన్నారు. ఇప్పటికే జిల్లాలోని ఉపాధ్యాయులు జీఈఆర్‌ సర్వేలో ఉన్నారని, అంగన్‌వాడీ విధులు నిర్వహించలేమన్నారు. యూటీఎఫ్‌ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రసాద్‌, రామకృష్ణ, దస్తగిరి పాల్గొన్నారు. అలాగే.. అంగన్‌వాడీ సెంటర్ల బాధ్యత ఉపాధ్యాయులకు అప్పగించరాదని డీఈఓ కార్యాలయంలోని ఏడీ అనురాధకు పీఆర్టీయూ నంద్యాల జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, నాయకులు కృష్ణారావు, విజయరావు, సుమయూన్‌, ప్రేమ్‌కుమార్‌ వినతి పత్రం అందజేశారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థిని అభినందిస్తున్న ఎమ్మెల్యే శిల్పా

నంద్యాల(న్యూటౌన్‌): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన కళాఉత్సవ్‌ పోటీల్లో నంద్యాల బాలభవన్‌కు చెందిన విద్యార్థి సాయిచరణ్‌ జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడని బాలభవన్‌ సూపరింటెండెంట్‌ ప్రసాదరెడ్డి సోమవారం తెలిపారు. మృదంగం విభాగంలో జిల్లా స్థాయిలో విజేతగా నిలిచి, రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడన్నారు. సాయి చరణ్‌ను ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్‌రెడ్డి అభినందించారు. నాగరాజు,నరసింహులు, సుధాకర్‌ పాల్గొన్నారు.

వ్యాసరచన,వక్తృత్వ పోటీలు

నంద్యాల(న్యూటౌన్‌): పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం జాతీయ వినియోగదారుల వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు జిల్లా స్థాయి వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. విజేతలకు ప్రిన్సిపాల్‌ శశికళ బహుమతులు అందజేశారు. అనంతరం జరిగిన వ్యాసరచన పోటీల్లో పాణ్యం, ఎర్రగుంట్ల, నందికొట్కూరు కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. తొలి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు ఈనెల 24న కలెక్టర్‌ బహుమతులు అందజేస్తారని ప్రిన్సిపాల్‌ తెలిపారు. తొలిస్థానంలో నిలిచిన వారు ఈనెల 22న విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు.

సమస్యలు పరిష్కరించండి..

నంద్యాల(న్యూటౌన్‌): అగ్రిగోల్డ్‌ బాధితులకు న్యాయం చేయాలని సీపీఐ నాయకులు కోరారు. సోమవారం స్థానిక జిల్లా కలెక్టర్‌ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. అనంతరం డీఆర్‌ఓ పుల్లయ్యకు వినతి పత్రం అందజేశారు. సీపీఐ సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్‌, రామచంద్రగౌడ్‌, అక్బర్‌ బాషా, మహబూబ్‌ బాషా, ఉసేన్‌ పాల్గొన్నారు. అలాగే.. గ్రూప్‌1,2 పోస్టు అభ్యర్థుల వయోపరిమితి 44 ఏళ్లకు పెంచాలని ఏఐవైఎఫ్‌, ఏఐఎస్‌ఎఫ్‌, పీడీఎస్‌యూ, పీవైఎల్‌, డీఎస్‌వైఎఫ్‌ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఆళ్లగడ్డ ప్రభుత్వ హాస్టల్‌లో సౌకర్యాలు కల్పించని వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు రఫీ, ఆనంద్‌ వినతి పత్రం అందజేశారు.

తెరుచుకున్న అంగన్‌వాడీ కేంద్రాలు



హరివరంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీడీపీఓ



రుద్రవరంలో అంగన్‌వాడీ కేంద్రంలో సరుకులను పరిశీలిస్తున్న అధికారులు

ఉయ్యాలవాడ : మండలంలోని 29 అంగన్‌వాడీ కేంద్రాలు తలుపులను ఆయా గ్రామ ఇన్‌చార్జ్‌ అధికారులు సోమవారం తెరిచారు. హరివరంలోని రెండు అంగన్‌వాడీ కేంద్రాలను ఆళ్లగడ్డ ఐసీడీఎస్‌ ప్రాజెక్ట్‌ అధికారిణి తేజస్విని, మహిళా పోలీస్‌ శిరీష; పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్‌బాబు, వీఆర్‌ఓ గోపాల్‌నాయుడు, సర్పంచ్‌ నడిపెన్న తలుపులు తెరిచి పరిశీలించారు. జిల్లా కలెక్టర్‌ ఆదేశాల మేరకు ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు 20 గ్రామాలకు సచివాలయ ఉద్యోగులను ఇన్‌చార్జ్‌లుగా నియమించారు.

రుద్రవరం: మండలంలోని 21 గ్రామ పంచాయతీల్లో ఉన్న 60 అంగన్‌వాడీ కేంద్రాలను సోమవారం మండల అధికారులు తెరిపించారు. ఏడు రోజులుగా అంగన్‌వాడీ కేంద్రాలను మూసేసి వర్కర్లు నిరసన చేపట్టడంతో చిన్నారులు, గర్భిణులు,బాలింతలు ఇబ్బందులు పడుతున్నారు. విషయాన్ని తెలుసుకున్న జిల్లా అధికారులు సచివాలయ ఉద్యోగులు, వీఆర్వోలు, మహిళా పోలీసులతో కేంద్రాల తలుపులు తెరిపించి పౌష్టికాహారం అందించాలని మండల అధికారులను ఆదేశించారు. దీంతో తహసీల్దారు రవీంద్ర ప్రసాదు, ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి, ఎంఈఓ శ్రీలక్ష్మి, సూపర్‌వైజర్‌ లక్ష్మీదేవి అంగన్‌వాడీ కేంద్రాలను తెరిపించి అక్కడ ఉన్న సరుకులను పరిశీలించారు.

ఆరోగ్యశ్రీ పెంపుతో ప్రజలకు ఆరోగ్య ధీమా

నంద్యాల(సిటీ): ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5లక్షల నుంచి రూ.25లక్షల వరకు పెంచడంతో ప్రజలకు ఆరోగ్య ధీమా లభిస్తుందని మున్సిపల్‌ అసిస్టెంట్‌ కమిషనర్‌ వెంకటదాసు అన్నారు. సోమవారం స్థానిక మున్సిపల్‌ కార్యాయంలోని వీడియో కాన్ఫరెన్స్‌ హాల్‌లో రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన ఆరోగ్యశ్రీ పరిమితి పెంపు కార్యక్రమానికి ఎంహెచ్‌ఓ డాక్టర్‌ అంకిరెడ్డితో కలిసి హాజరయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ ఇప్పటికే ఆరోగ్యశ్రీ ద్వారా 3వేలకు పైగా వ్యాధులకు ప్రైవేటు ఆసుపత్రుల్లో ఉచితంగా వైద్యం అందించడమే కాకుండా వారు స్వంత గృహాలకు చేరుకోవడానికి సరిపడా ఆర్థిక సాయం అందించడం హర్షనీయమన్నారు.

ఆరోగ్యశ్రీ పరిమితి రూ. 25 లక్షలకు పెంపు

శిరివెళ్ల: వైఎస్సార్‌ ఆరోగ్యశ్రీ పరిమితిని ప్రభుత్వం రూ.25 లక్షలకు పెంచిందని ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం తెలిపారు. సోమవారం స్థానిక రైతు భరోసా కేంద్రంలో ఆరోగ్యశ్రీ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కార్డుదారులు రూ. 5 లక్షల నుంచి రూ. 25 లక్షలకు ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా వైద్య సేవలు పొందవచ్చన్నారు. ప్రస్తుతం 3,257 చికిత్సలను 2,285 ప్రభుత్వ, ప్రైవేట్‌ వైద్యశాలలో ఉచితంగా అందజేస్తున్నారని చెప్పారు. వైద్యాధికారి ముఖేష్‌, సీహెచ్‌ఓ రామ్మోహన్‌రెడ్డి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



శిరివెళ్లలో బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు

ఆరోగ్య శ్రీపై అవగాహన

ఉయ్యాలవాడ: ఆరోగ్యశ్రీ పై ప్రజలకు పూర్తిగా అవగాహన కల్పించాలని ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు అధికారులకు సూచించారు. సోమవారం స్థానిక మండల పరిషత్‌ కార్యాలయంలో సీఎం వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన అధికారులతో ఆరోగ్య శ్రీపై సమీక్ష నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.25లక్షల వరకు పెంచిందని చెప్పారు. ఈ మొత్తాన్ని, పథకం పరిధిలోకి వచ్చే వ్యాధుల గురించి ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత ఉద్యోగులపై ఉందన్నారు. అలాగే ప్రతి కార్డుదారుడి సెల్‌ఫోన్‌లో ఆరోగ్య శ్రీ యాప్‌ డౌన్‌లోడ్‌ చేయించాలని చెప్పారు. ఈఓపీఆర్‌డీ వెంకటేశ్వర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు

నంద్యాల(అర్బన్‌): సామాన్య కార్యకర్తగా ఉన్న తనను వైఎస్సార్‌సీపీ రాష్ట్ర క్రిస్టియన్‌ మైనార్టీ సెల్‌ కమిటీ సెక్రటరీగా నియమించినందున మాజీ మంత్రి శిల్పా మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్‌రెడ్డికి కారు రవికుమార్‌ సోమవారం కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే నివాస గృహంలో వారిని మర్యాదపూర్వకంగా కలిసి పూల మాలలతో సత్కరించారు. కారు రవి మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధిస్తుందని చెప్పారు.

విద్యుత్‌ పొదుపు- సామాజిక బాధ్యత

నంద్యాల(అర్బన్‌): విద్యుత్‌ను పొదుపుగా వాడటాన్ని ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా తీసుకోవాలని నంద్యాల విద్యుత్‌ శాఖ డీఈ ఏతరా మయ్య కోరారు. విద్యుత్‌ వారోత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక టెక్కె మున్సిపల్‌ హైస్కూల్‌ విద్యార్థులకు విద్యుత్‌ పొదుపుపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఏఈ సుబ్బారావు, 14వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్‌ సోమశేఖర్‌రెడ్డి, హెచ్‌ఎం అబ్దుల్‌ ఖాదర్‌ పాల్గొన్నారు.

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

నంద్యాల(అర్బన్‌): శిల్పా మహిళా సహకార్‌ బ్యాంక్‌ అందిస్తున్న తక్కువ వడ్డీ రుణాలను సద్వినియోగం చేసుకొని మహిళలు అభివృద్ధి చెందాలని నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్‌రెడ్డి సూచించారు. స్థానిక టెక్కె మార్కెట్‌ యార్డులో సోమవారం మహిళా బ్యాంక్‌ చైర్‌పర్సన్‌ శిల్పా నాగినిరెడ్డి అధ్యక్షతన 147 మంది మహిళలకు రూ.19.19 లక్షల విలువైన చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు.

మహానందీశ్వరుడికి పల్లకీ సేవ

మహానంది: మహానందిలో వెలసిన శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వర దంపతులకు సోమవారం రాత్రి పల్లకీ సేవ వైభవంగా నిర్వహించారు. ఈఓ చంద్రశేఖరరెడ్డి ఆధ్వర్యంలో స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి పల్లకీలో కొలువు చేశారు. గణపతిపూజ, పుణ్యాహవాచనం, అలంకార హారతులు నిర్వహించిన అనంతరం ఆలయ ప్రాకారాల్లో ఊరేగించారు. భక్తులు పల్లకీని మోస్తూ భక్తిశ్రద్ధలను చాటుకున్నారు. పూజా కార్యక్రమాల్లో వేదపండితులు రవిశంకర అవధాని, నాగేశ్వరశర్మ, భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా సుబ్రహ్మణ్య షష్ఠి వేడుకలు



సత్యనారాయణ స్వామి ఆలయంలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణం జరిపిస్తున్న దృశ్యం


నంద్యాల(వ్యవసాయం): ధనుర్మాసంలో భాగంగా సుబ్రహ్మణ్యేశ్వర షష్ఠి సందర్భంగా పట్టణంలోని పలు ఆలయాల్లో అభిషేకాలు, కల్యాణం, ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. కోటా వీధిలో వెలసిన శ్రీ రమాసమేత సత్యనారాయణ స్వామి దేవస్థానంలో శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి వేద పండితులు లోకేష్‌ శర్మ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా కల్యాణోత్సవాన్ని జరిపించారు. అనంతరం 41 మంది మహిళలకు ఒడి బియ్యం పోశారు. అలాగే.. నాగులకుంట రోడ్డులోని నాగలింగేశ్వరాలయంలో వేద పండితుడు విశ్వనాథ శాస్త్రి ఆధ్వర్యంలో నాగలింగేశ్వరస్వామికి ఉదయాన్నే పంచామృతాభిషేకాలు, సుగంధ ద్రవ్యాలు, డ్రైఫ్రూట్లతో అభిషేకాలు చేసి స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి మహా మంగళ హారతులు ఇచ్చారు. శ్రీలక్ష్మి మద్దిలేటి లక్ష్మీనరసింహ ఆలయంలో స్వామికి అభిషేకాలు, సుగంధ ద్రవ్యాలతోఅభిషేకం చేశారు. షష్టిని పురస్కరించుకుని పట్టణంలోని శ్రీ గణేష్‌ భక్త బృందం ఆధ్వర్యంలో పాణ్యం మండలంలోని కొత్తూరు సుబ్బరాయుడు దేవస్థానానికి పాదయాత్ర చేపట్టారు.



నేడు నూతనంగా నిర్మిస్తున్న రహదారి

తీరనున్న రోడ్డు కష్టాలు

- ఉయ్యాలవాడ– కొండుపల్లె రోడ్డుకు మహర్దశ
- రూ.9.50 కోట్లతో తారు రోడ్డు పనులు ప్రారంభం



నాడు ఉయ్యాలవాడ నుంచి కొండుపల్లెకు వెళ్లే రహదారి దుస్థితి

ఉయ్యాలవాడ : గతంలో ఆ రోడ్డుపై ప్రయాణమంటేనే జనం జడుసుకునేవారు. ద్విచక్ర వాహనాలు, ట్రాక్టర్లు, ఎద్దుల బండ్లు, పాదచారులు సైతం ఉయ్యాలవాడ కొండుపల్లె రహదారిలో వెళ్లేందుకు ఎన్నో అవస్థలు పడ్డారు. సమస్యను పరిష్కరించాలని గత ప్రభుత్వంలో ప్రజలు పలుమార్లు పాలకుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత రోడ్డు నిర్మాణం కోసం ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని దశాబ్దాలుగా వేధిస్తున్న రోడ్డు సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం నుంచి రూ. 9.50 కోట్లు మంజూరు చేయించారు.టెండర్‌ ప్రక్రియ పూర్తి కావడంతో పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఉయ్యాలవాడ నుంచి కొండుపల్లె వరకు 6 కి.మీ మేర తారురోడ్డుతో పాటు రహదారిలో 7 వంతెనలు, 150 మీటర్ల పొడువున రక్షణ గోడలు, 350 మీటర్ల పొడువున సిమెంట్‌ రోడ్డు పనులు చేయాల్సి ఉంది. ప్రస్తుతం కంకర వేసే పనులు జరుగుతున్నాయి. 2024 మార్చి నాటికి పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని పంచాయతీరాజ్‌ డీఈ లక్ష్మీనరసింహుడు ఆదివారం తెలిపారు.

చిరువ్యాపారులకు అండగా ఉంటాం



మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ మాబున్నీసాను సన్మానిస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్‌): పట్టణంలోని చిరువ్యాపారులకు అండగా ఉంటామని నంద్యాల మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ మాబున్నీసా తెలిపారు. సోమవారం స్థానిక చిరు వ్యాపారుల సంక్షేమ సంఘం కార్యాలయంలో జరిగిన జిల్లా మహాసభకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ రోజువారి గేట్లను తీసేయడం, వడ్డీలేని రుణాలు ఇవ్వడం, ఇళ్లు లేని వారికి ఇళ్లు కట్టించి ఇవ్వడం వంటి వాటిని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని చెప్పారు. అనంతరం జిల్లా, పట్టణ నూతన కమిటీ బాధ్యుల ఎంపిక కార్యక్రమం చేపట్టారు. సంఘం గౌరవ అధ్యక్షులు ఆకుమల్ల రహీం, జిల్లా ప్రధాన కార్యదర్శి మదార్‌వలి, అన్వర్‌, సిద్ధయ్య, మన్సూర్‌ పాల్గొన్నారు.

స్పీడ్‌ బ్రేకర్లు వేయండి

నంద్యాల(న్యూటౌన్‌): పట్టణంలోని నూనెపల్లె ఫ్లైఓవర్‌ బ్రిడ్జ్‌ పై రెండు వైపులా స్పీడ్‌ బ్రేకర్లు వేయాలని ఏపీ ఆటో డ్రైవర్స్‌ యూనియన్‌, సీఐటీయూ నాయకులు కోరారు. సోమవారం రాస్తారోకో నిర్వహించారు. సీఐటీయూ నాయకులు లక్ష్మణ్‌, గౌస్‌ మాట్లాడుతూ స్పీడ్‌ బ్రేకర్లు లేకపోవడంతో బ్రిడ్జ్‌పై రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు.